నమస్తే తెలంగాణ
సిద్దిపేట

I | హైదరాబాద్, బుధవారం 12 మార్చి 2025 | SIDDIPET

అభివృద్ధిని రెట్టింపు చేసి చూపించాలి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 11: పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు రెట్టింపు చేసి చూపించాలని, బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే కేసీఆర్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని రెట్టింపు చేసి చూపించాలి గానీ, చేతకాక బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. పదేండ్లలో ప్రజలను కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నారని, 15 నెలల కాలంలోనే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరక్తి వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారు కానీ, అమలుకాని 420 హామీలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా మండుటెండల్లో సైతం చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నింపి గుంట కూడా ఎండిపోకుండా రైతుల ముఖాల్లో సంతోషం నింపిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కండ్ల ఎదుటే రైతుల పొలాలు, చెరువులు, కుంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా కేసీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులు సాగు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, తక్షణమే సాగునీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.180కోట్ల నిధులు మంజూరు చేస్తే అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ అభివృద్ధిని తుంగలో తొక్కిందన్నారు. గజ్వేల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్ ఇక్కడి నుంచి తీసుకెళ్లిన నిధులు, పెండింగ్ పనులపై స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మిగిలిన 10శాతం పనులకు వెంటనే రూ.100కోట్లు మంజూరు చేసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

ఘనపూర్ చెక్‌డ్యామ్ నిండడంతో కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

నంగునూరు, మార్చి 11: రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో మండలంలోని ఘనపూర్ చెక్‌డ్యామ్ నిండి మత్తడి దుంకుతున్నది. మంగళవారం ఘనపూర్ గ్రామానికి చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కరెడ్ల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అల్లూరి విజేందర్‌రెడ్డి, బాలనర్సయ్య, అనిల్ రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్, సంపత్, రాజిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

ఆకునూరులో ఎండిన పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 11: సాగునీరు అందించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్ ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ఆకునూరులో ఎండిన పంటలను బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకున్నారని, కాంగ్రెస్ పాలనలో రైతులు అన్నమో రామచంద్రా అంటూ విలపిస్తున్నారని విమర్శించారు. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దేడ్చిన వ్యవసాయం చరిత్రలో బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలని, పొలాలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువజన నాయకుడు నిమ్మ నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సైతం నామమాత్రంగానే ఉందని, రైతు ప్రభుత్వమని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ రైతులను నిండా ముంచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాల బాలరాజు, నాయకులు తోళ్ల భిక్షపతి, రణం ప్రశాంత్, తోళ్ల సత్యం, సోషల్ మీడియా అధ్యక్షుడు వంశీ, రైతులు సత్యనారాయణ, నాగేశ్వర్ తదితరులున్నారు.

జీతం వస్తలేదని పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య

ప్రశాంత్ (ఫైల్)

చేగుంట, మార్చి 11: జీతం వస్తలేదని, ఆర్థిక ఇబ్బందులతో పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం చెట్లతిమ్మాయిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చేపూరి ప్రశాంత్ (31) కొన్ని రోజులుగా చెట్లతిమ్మాయిపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఐదారు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబం గడవటం లేదు. అతడి భార్య సుకన్య, ఏడాదిన్నర కూతూరు వైశాలికతో రెండు నెలల క్రితం బ్రాహ్మణపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. కుటుంబం గడవక, ఆర్థిక ఇబ్బందులతో ప్రశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఆయకట్టుకు సాగునీరు అందని దయనీయ పరిస్థితి నెలకొంది. సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కండ్ల ఎదుట పంటలు ఎండిపోతుండటంతో రైతులు కంటతడి పెడుతున్నారు. సింగూరు ప్రాజెక్టు కింద క్రాప్‌హాలిడే ప్రకటించటం రైతులకు శాపంగా మారింది. కాల్వల లైనింగ్ పనుల కోసం యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. క్రాప్ హాలిడేపై నీటిపారుదల శాఖ ప్రచారం చేయకపోవటంతో రైతులు కాల్వల కింద వరి ఇతర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం కాల్వల ద్వారా సాగునీరు నిలిచిపోయింది. దీనికితోడు బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటడం, కరెంటు సమస్యలతో వరి పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో సింగూరు ప్రాజెక్టు దిగువన వరి పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు తగ్గటం, కరెంటు సమస్యలు ఉన్నందున పంటలను కాపాడేందుకు అవసరమైన సాగు నీటిని సింగూరు ప్రాజెక్టు నుంచి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. నల్లవాగు ప్రాజెక్టు కింద సైతం ఇదే సమస్య ఉంది. ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు సాగునీరు అందకపోవటంతో వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు నల్లవాగు నుంచి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లు ఇచ్చి పంటలను బతికించండి

యాసంగిలో నాలుగు ఎకరాల్లో పంటలు వేశాను. మూడు ఎకరాల్లో చెరుకు, ఎకరంలో వరి పంట వేశాను. నీళ్లు లేక వరి పంట పూర్తిగా ఎండిపోతుంది. చెరుకు పంట ఎండిపోవటం ప్రారంభమైంది. భూగర్భ జలాలు పడిపోవటంతో బోర్లు పోయటం లేదు. సింగూరులో నీళ్లు ఉన్నందున కాల్వల ద్వారా సాగునీరు ఇచ్చి ప్రాజెక్టు కింద రైతులను ఆదుకోవాలి.
– లక్ష్మయ్య, రైతు, ముద్దాయిపేట

పంట ఎండిపోతుంది.. ఆదుకోండి

యాసంగి సీజన్‌లో ఆరు ఎకరాల్లో వరి పంట వేశాను. ఇప్పుడు నీళ్లు లేక పంట ఎండిపోతుంది. మరికొద్ది రోజులు నీళ్లు లేకపోతే వేసిన పంట అంతా ఎండిపోయే ప్రమాదం ఉంది. సింగూరు ప్రాజెక్టు కింద క్రాప్‌హాలిడే ఉందని, కాల్వల ద్వారా నీళ్లు ఇవ్వటం లేదు. సింగూరు కాల్వల లైనింగ్ పనులు ఇంకా మొదలు కాలేదు. ఇప్పుడు పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం రైతుల పరిస్థితిని గమనించి సింగూరు నుంచి కాల్వల ద్వారా పొలాలకు నీళ్లు ఇవ్వాలి. – రాజేందర్, రైతు, పుల్కల్



నీటితో కళకళలాడుతున్న సింగూరు ప్రాజెక్టు

ప్రాజెక్టులు నిండుగా ఉన్నా... అందని సాగునీరు

- సింగూరు రైతులకు శాపంగా మారిన క్రాప్ హాలిడే
- ప్రాజెక్టు దిగువన నీళ్లులేక ఎండుతున్న పంటలు
- సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలంటున్న రైతులు
- నల్లవాగు ప్రాజెక్టు కింద సాగు నీటి కోసం రైతుల డిమాండ్

సంగారెడ్డి జిల్లాలో సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల కింద ఎండుతున్న పంటలు

సంగారెడ్డి మార్చి 11 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1.95 లక్షల ఎకరాలకు పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ, 1.15 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు అయ్యాయి. 95వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా 40వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు అయ్యింది. ప్రాజెక్టులు, చెరువుల కింద పంటల సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. సింగూరు ప్రాజెక్టు కింద కాల్వల లైనింగ్ పనులు ఉండటంతో యాసంగి సీజన్‌లో ఇరిగేషన్ శాఖ క్రాప్ హాలిడే ప్రకటించింది. క్రాప్‌హాలిడే అంశం ప్రచారం జరగకపోవటంతో రైతులు బోరుబావులు, కాల్వల కింద పంటలు సాగుచేశారు. సింగూరు ప్రాజెక్టు కింద యాసంగి సీజన్‌లో 25వేల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా, 16వేల ఎకరాల్లో సాగు అయ్యాయి. నల్లవాగు ప్రాజెక్టు కింద 6030 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా 4089 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో 500 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న చెరువులు 15 ఉన్నాయి. ఈ చెరువుల కింద యాసంగి సీజన్‌లో 15వేల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా, 4100 ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యాయి. మిగతా చెరువుల కింద 89వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా 40వేల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు.

సింగూరు కింద ఎండుతున్న పంటలు

సింగూరు ప్రాజెక్టు కింద ప్రస్తుతం సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కండ్ల ఎదుట పంటలు ఎండిపోతుండటంతో రైతులు సింగూరు ప్రాజెక్టు కాల్వల ద్వారా సాగునీరు ఇచ్చి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో సింగూరు ప్రాజెక్టు కింద క్రాప్‌హాలిడే ప్రకటించారు. క్రాప్‌హాలిడే అంశం రైతులకు పూర్తిస్థాయిలో చేరకపోవడంతో రైతులు కాల్వలు, బోరుబావుల కింద పంటలు వేశారు. సింగూరు ప్రాజెక్టు ఎడమ కాల్వ దిగువన పుల్కల్, చౌటకూరు మండలాల్లోని రైతులు 16వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు వేశారు. క్రాప్‌హాలిడే నేపథ్యంలో సింగూరు ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా సాగునీరు పూర్తిగా నిలిపివేశారు. భూగర్భజలాలు పడిపోతుండటంతో బోరుబావులు నీళ్లు పోయటం లేదు. దీనికితోడు కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలతో పుల్కల్, చౌటకూరు మండలాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సింగూరు నుంచి కాల్వల ద్వారా సాగునీరు ఇచ్చి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీ కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 22.54 టీఎంసీల జలాలు ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వల కింద మొత్తం 68 కిలోమీటర్ల కాల్వల లైనింగ్ పనులు రూ.153 కోట్లతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.133 కోట్లతో కాల్వల లైనింగ్ పనులను సీవేట్ అనే నిర్మాణ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం కాల్వల్లో పూడికతీత, జంగల్ క్లియరెన్స్ పనులు మొదలయ్యాయి. ఇంకా లైనింగ్ పనులు ప్రారంభం కానందున ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సింగూరు ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగునీరు ఇచ్చాక తిరిగి లైనింగ్ పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని, పంటలు కాపాడేందుకు వీలుగా సాగునీరు ఇవ్వాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

పుల్కల్ మండలం ముద్దాయిపేటలో సాగునీరు లేక ఎండిపోతున్న వరిపంట

నీరులేక వెలవెలబోతున్న సింగూరు కాల్వ

నల్లవాగు కింద సాగునీటి కోసం డిమాండ్

నల్లవాగు ప్రాజెక్టు కింద సాగునీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నల్లవాగు ప్రాజెక్టు పూర్తి నిల్వసామర్థ్యం 1493 ఫీట్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1485.6 ఫీట్ల మేర జలాలు ఉన్నాయి. యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు దిగువన కుడి, ఎడమ కాల్వల కింద 6,030 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా, 4,090 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు. యాసంగి సీజన్‌లో రైతులు ప్రాజెక్టు కింద 5వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, ఖానాపూర్ తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా వరి పంట వేశారు. ప్రాజెక్టు కింద ఇప్పటి వరకు మూడు విడతలుగా సాగునీరు విడుదల చేశారు. రైతులు వరి పంట సాగు చేయటంతో మరో రెండు విడదలు సాగునీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. టెయిల్‌ఎండ్‌లో ఉన్న కృష్ణాపూర్, ఇందిరానగర్, కల్హేర్ గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందకపోవటంతో వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడేందుకు వీలుగా నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్‌తో వరి పంటకు నీళ్లు పెడుతున్న రైతు కంకణాల చంద్రం

పక్కనే రిజర్వాయర్ ఉన్నా..

- బోర్లు వేసినా ఫలితం శూన్యం
- వాటర్ ట్యాంకర్‌తో వరికి నీళ్లు పెడుతున్న తపాస్‌పల్లి రైతు చంద్రం

కొమురవెల్లి, మార్చి 11: రిజర్వాయర్ పక్కనే ఉన్నా తపాస్‌పల్లి రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి చెందిన కంకణాల చంద్రం ఎకరం 30 గుంటల్లో వరి సాగు చేశాడు. బోరుబావుల్లో నీరు తగ్గడంతో పంటను కాపాడుకునేందుకు ఇటీవల రెండు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. అప్పటికే 20 గుంటల వరి ఎండిపోయింది. మరో 20 గుంటల వరి పంటకు నీళ్లు అందడం లేదు. దీంతో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతు చంద్రం రోజుకు రూ.2వేల వరకు వెచ్చించి వాటర్ ట్యాంకర్ ద్వారా పంటకు నీళ్లు అందిస్తున్నాడు. పక్కకే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా సరిగ్గా నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఫెయిల్ అయిన బోరు వద్ద రైతు కంకణాల చంద్రం

కేసీఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట

- కల్యాణలక్ష్మితో ఆడబిడ్డల పెండ్లికి ఆర్థికభరోసా ఇచ్చాం
- గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశాం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని, మహిళా నాయకులను గజమాలతో సన్మానిస్తున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ దంపతులు

పటాన్‌చెరు, మార్చి 11: కేసీఆర్ హయాంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సునీతాలక్ష్మారెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు సుమిత్రానంద్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజయపాల్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, గీతాభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వారు తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే మహిళా సంక్షేమం సాధ్యమైందన్నారు. కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డల పెండ్లిలకు ఆర్థిక భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేసి వారి ఆరోగ్యాలను కాపాడారన్నారు. షీటీమ్స్‌తో మహిళలకు భద్రత కల్పించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉండేవన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళా సంక్షేమం కనిపించడం లేదన్నారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి మహిళా దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంక్షేమాన్ని అద్భుతంగా అమలు చేశామన్నారు. మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించామన్నారు. ప్రతి విషయంలో మహిళలు పురుషులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానన్నారు. మహిళలకు సొంత ఖర్చుతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి శిక్షణ అందజేస్తున్నానని వివరించారు. స్కూటీలు ఇచ్చి మహిళలను ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌లో మహిళలకు పూర్తి భద్రత ఉండేదన్నారు. పటాన్‌చెరు మహిళలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, ఆదర్శ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, శ్రీధర్‌చారి, పృథ్వీరాజ్, మెరాజ్ ఖాన్, రామకృష్ణ, రమా మెట్టు కుమార్ యాదవ్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

తడ్కల్‌ను మండల కేంద్రం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి, మార్చి 11: కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు తడ్కల్ ప్రజలను రెచ్చగొట్టి మండలం ఏర్పాటు కోసం రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేశారని, ఇప్పుడు వారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో మేము అధికారంలో ఉన్నప్పుడు గెజిట్ సైతం విడుదల చేయశామని, అంతలోనే తడ్కల్ మండలంలో అంతర్భాగం అవుతున్న గాజుల్‌పాడ్, సుక్కల్‌తీర్థ్ గ్రామాల ప్రజలను కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టి అప్పుడు మండల ఏర్పాటును ఆపేశారని ఆరోపించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న వారు ఎందుకు చేయడం లేదన్నారు. తడ్కల్ మండలం ఏర్పాటయ్యేవరకు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు కామారెడ్డి జిల్లా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారం మాట్లాడుతూ సామరస్యంగా మండలాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ పాల్గొన్నారు.